కార్పొ 'రేటు' దోపిడీ

- చైతన్య, నారాయణలో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు
- నియంత్రణలో విద్యా శాఖ విఫలం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కార్పొరేటు పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల దోపిడీ కొనసాగుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని చైతన్య, నారాయణ విద్యా సంస్థల్లో వివిధ పేర్లతో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. అన్నీ తెలిసినా విద్యా శాఖ అధికారులు ఫీజుల నియంత్రణలో విఫలం అయ్యారని పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి...

తమ విద్యార్థులను ఉన్నతమైన నాణ్యమైన చదువులను చదివించాలని తల్లిదండ్రుల కార్పొరేట్ మోజు కార్పొరేట్ విద్యా సంస్థలకు కాసుల వసూళ్లకు అవకాశంగా మారింది. ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అక్రమ వసూళ్లకు తెర తీశారు. నర్సరీకే రూ.30వేలు పైబడి వసూలు చేస్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు, ఆ తర్వాత విద్యార్థులకు పాఠశాలను బట్టి రూ.60 వేల నుంచి సుమారు రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. పట్టణాల్లో చదవాలంటే హాస్టలు వసతి కూడా వారికి అవసరమవుతుంది. దాంతో రెసిడెన్షియల్ క్యాంపస్‌ల పేరుతో హాస్టల్ కోసం అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. సాధారణ చదువులతో పాటు ఐఐటీ ఫౌండేషన్ అంటూ మరి కొంత నొక్కుతున్నారు. దీంతో విద్యార్థులను స్కూళ్లలో చేర్పించేందుకు వచ్చి వెనక్కి వెళ్లలేక చేర్పించే సాహసం చేయలేక తలిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో అగ్రభాగాన ఉన్న చైతన్య, నారాయణ విద్యా సంస్థలు ఫీజుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. చైతన్య, నారాయణ కళాశాలకు హాస్టళ్లు ఉండడంతో పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు చేరుతున్నారు. డిమాండ్‌ను బట్టి ఫీజులు గుంజుతున్నారు. ఇంటర్మీడియట్‌కు రూ.లక్ష నుంచి రూ.2,20,00 వరకూ ఫీజు వసూలు చేస్తున్నారు. అసలు సీట్లే లేవని ముందు చెప్పడం ఆ తర్వాత వారు ప్రాధేయపడే కొద్దీ ఫీజులు పెంచి వసూలు చేస్తున్నారని, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలో ఫీజులు నియంత్రణను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

కర్నూలు శ్రీరాం నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల

● యాప్ పేరుతో కొత్త దోపిడీ

కార్పొరేట్ పాఠశాలల్లో యాప్ పేరుతో కొత్త దోపిడీకి పాల్పడుతున్నారు. పాఠశాలకు చెందిన యాప్‌లో విద్యార్థులు కట్టిన, పెండింగ్ ఉన్న ఫీజుల వివరాలు, పాఠశాల సమాచారం, విద్యార్థుల అటెండెన్స్, పాఠశాల కార్యక్రమాల వీడియోలు ఉంటాయి. సబ్జెక్ట్ ఏమీ ఉండదు. ఆ యాప్ పేరుతో ఒకటో తరగతి లోపు విద్యార్థుల నుంచి రూ.2వేలు, 1 నుంచి ఐదో తరగతి వరకూ రూ.3వేలు, 6 నుంచి పదో తరగతి వరకూ రూ.5వేలు వసూలు చేస్తున్నారు.

● నిబంధనలకు నీళ్లు.. ఆట స్థలమూ కరువు..

కార్పొరేటు పాఠశాలలుగానీ, హాస్టళ్లుగానీ జిల్లాలో ఒకటి, రెండు చోట్ల మినహా నిబంధనల ప్రకారం నడవడం లేదు. పాఠశాలలకు మైదానాలు ఉండవు, రిజిస్ట్రేషన్ కోసం ఎక్కడో మైదానం చూపిస్తారు. అది ఎక్కడుందో విద్యార్థులకు ఎప్పటికీ తెలిసే పరిస్థితి ఉండదు. కర్నూలు నగరంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం లేదు. చాలా ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. రోడ్డు పక్కనే విద్యా సంస్థలు నడుపుతూ విద్యార్థులను శబ్ద కాలుష్యానికి గురి చేస్తున్నారు. చాలా స్కూళ్లలో ఫైర్ సేఫ్టీ కూడా ఉండడం లేదు. ఉన్నా నామమాత్రమే. పాఠశాలలే కాదు హాస్టల్లో కూడా సరైన వస్తువులు లేకుండా నిర్వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

భారంగా ఫీజులు

మా నుంచి పుస్తకాలు ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మెటీరియల్ కాస్ట్‌తో వసూలు చేస్తున్నారు. స్కూల్ యాప్ పేరుతో అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారు. పాఠశాలలో ఏ కార్యక్రమాలు చేసినా విద్యార్థులతో ఖర్చు చేయిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల ప్రకారమే వసూలు చేయాలి. రకరకాల పేరుతో వసూలు చేయడం భారంగా మారుతోంది.

- వై.శిరీష, ఇందిరాగాంధీ నగర్, కర్నూలు.

ఫీజులు ఏ క్లాస్ కు ఎంత తీసుకుంటారు అన్నది నోటీసు బోర్డులో నమోదు చేయాలి. కానీ విద్యార్థి సంఘాలు పదే పదే చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు ఫీజులు వసూలుతోపాటు పుస్తకాల పేరుతో మరి కొంత లాగుతున్నారు. ఇలా రకరకాల పేర్లతో కార్పొరేట్‌పై తలిదండ్రుల ఆశనే కాసుల రూపంలో మార్చుకుంటున్నారు.

కార్పొరేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఏ కార్పొరేటు పాఠశాలా ఫీజులను వసూలు చేయడం లేదు. అధికంగా వసూలు చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు కూడా ప్రయివేటు, కార్పొరేటు యాజమాన్యాలకే వత్తాసు పలికే విధంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించాలని కోరిక ఉన్న తల్లిదండ్రులను ఫీజులను చూసి భయపడుతున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు, విద్యా శాఖ మంత్రి స్పందించి ఫీజు నియంత్రణ చట్టం పటిష్ఠంగా అమలు చేసేలా చూడాలి. అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.

- ఎం.రంగప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

జనాభా నిర్వహణను రూపొందించేందుకు సర్వే

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జనాభా నిర్వహణ విధానం రూపొందించేందుకు సర్వే నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో జనాభా నిర్వహణ విధానంపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, స్టాటిస్టికల్ ఆఫీసర్ల తో కలెక్టర్ అవగాహనా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జనాభా నిర్వహణ విధానం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం డ్రాఫ్ట్ పేపర్‌ను విడుదల చేశారు. జనాభా గణనీయంగా తగ్గుముఖం పట్టే ట్రెండ్ లో ఉందని, అందువల్ల ముఖ్యమంత్రి ముందు చూపుతో మేలుకొలుపు లాగా ఈ కార్యక్రమం తీసుకొని వచ్చారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా క్యూఆర్ కోడ్ ద్వారా 9 ప్రశ్నలు ఇవ్వడం జరిగిందని, వాటి ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించాలని కలెక్టర్ ఎంపిడిఒలను ఆదేశించారు.. మండల స్థాయిలో సమావేశాలను నిర్వహించుకోవాలని కలెక్టర్ తెలిపారు .ప్రజాభిప్రాయం ప్రతిబింబించే విధంగా సర్వేను నిర్వహించాలన్నారు. సమావేశంలో పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, మెప్మా పిడి నాగశివ లీల, టూరిజం అధికారి విజయ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

- జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. మంగళవారం ఎపిఎస్‌పి క్యాంపులో ఏర్పాటుచేసిన వేసవి బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా వచ్చి విజేతలైన జట్లకు బహుమతులు అందజేశారు. నిత్యం క్రీడల్లో సాధన చేస్తే వాటి ద్వారా వచ్చే ప్రశంసా పత్రాల వలన విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎస్‌పి తెలిపారు. విశిష్ట అతిథిగా హాజరైన ఎపిఎస్‌పి కమాండెంట్ దీపిక పాటిల్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ తనకు క్రీడలు అంటే ఎంతో ఇష్టమని, అందులో రాణిస్తే నిత్యం ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. బాలుర విభాగంలో ఈగల్ జట్టు గెలుపొందగా, బాలికల విభాగంలో లేకర్స్ జట్టు విజయం సాధించింది. బాలుర జట్టులో ద్వితీయ స్థానం బుల్స్‌సాధించగా బాలికల విభాగంలో ద్వితీయ స్థానం హుప్‌స్టార్ జట్లు సాధించినట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు దాదాబాష, ముస్తాహిర్‌బాష తెలిపారు. బాస్కెట్ బాల్ శిక్షకులు పాండురంగారావు , వినయ్‌రాజ్ కుమార్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న దీపిక పాటిల్

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

-వైసిపి మహిళా విభాగం నిరసన ప్రదర్శన
-అంబేద్కర్ విగ్రహానిక వినతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో నారా వారి పాలనలో నరబలి జరుగుతుందని కర్నూలులో వైసిపి మహిళ విభాగం నాయకులు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వానికి మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ మహిళల రక్షణపై లేదని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైసిపి మహిళా విభాగం కర్నూలు జిల్లా అధ్యక్షురాలు శశికళ విమర్శించారు. వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో కర్నూలు పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. కూటమి ప్రభుత్వం పై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైసిపి నాయకులు సోషల్ మీడియాపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. చంద్రబాబు పాలనలో మహిళలపై, బాలికలపై, అత్యాచారాలు, హత్యలు జరిగాయన్నారు. చిన్న పిల్లల నుండి మహిళల వరకు రక్షణ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందని ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు దర్శనం ఇస్తున్నాయన్నారు. ఇంత జరుగుతున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించడం లేదన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉండి ఉంటే మహిళలకు పెద్దపీట వేసి సంక్షేమ పథకాలు అమలు చేసే వారన్నారు. దిశ యాప్ ద్వారా రక్షణ కల్పించారని కోరారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా మహిళలకు రక్షణ కల్పించాలని లేదంటే పెద్ద ఎత్తున ప్రజలు మహిళలు తిరగబడి కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న వైసిపి మహిళా నాయకులు

ఆడబిడ్డలను అవమానిస్తే ఉపేక్షించేది లేదు

- పాణ్యం నియోజవర్గ కూటమి మహిళలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మహిళలను అత్యంత జుగుప్సాకరమైన భాషలో దూషించిన సాక్షి ఛానల్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు, అందుక సహకరించి కొమ్మినేని శ్రీనివాసరావును చర్యలు తీసుకోవాని పాణ్యం నియోజకవర్గం మహిళలు డిమాండ్ చేశారు. ఆడబిడ్డలకు వైఎస్.భారతి రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. సజ్జల వ్యాఖ్యలను ఖండించకపోగా మహిళలను సంకర జాతి అనటం వారి అవివేకానికి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. మహిళలు తలుచుకుంటే నువ్వు పాతాళానికి వెళ్లడం ఖాయమని ముక్తకంఠంతో హెచ్చరించారు. సాక్షి ఛానల్, దినపత్రికను మూసివేయాలంటూ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో మాధవి నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి అమ్మ హాస్పిటల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాక్షి దినపత్రికలను దగ్ధం చేశారు. కూటమి పార్టీ మహిళలతోపాటు మహిళ నాయకురాలు శైలజ యాదవ్, వసుంధర, రాములమ్మ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి, పల్లె రఘునాథ్ రెడ్డి, నన్నూరు సర్కార్ హుస్సేన్, అర్బన్ వార్డ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న కూటమి మహిళలు

35వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

- వంటావార్పుతో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మున్సిపల్ ఇంజినీరింగు కాంట్రాక్టు కార్మికుల సమ్మె 35వ రోజుకు చేరింది. నగర ప్రజలకు ఏళ్ల తరబడి మంచినీరు అందిస్తున్న మాకు మాత్రం జీతాలు పెంచకుండా వెట్టిచాకిరి చేయించుకుంటూ కన్నీరు మిగులుస్తున్నారని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల యూనియన్ నగర అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సమ్మెలో భాగంగా వంట వార్పు కార్యక్రమం చేశారు. నగరంలో ఉన్నటువంటి ప్రజలందరికీ ప్రతిరోజు తమ సేవలను అందిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగు కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కాలంలో బతకడానికి కావలసిన కనీస వేతనం ఇవ్వాలని, అదేవిధంగా మమ్ములను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపి మా కుటుంబాల్లో ఉన్నటువంటి వితంతువులు వికలాంగులు వృద్ధుల పింఛన్లను సైతం నిలుపుదల చేసి మా పిల్లల చదువుల్లో గుదిబండ మోపుతూ మేము పేదరికంలోకి దిగజారి పోతున్నామన్నారు. తమరికి ఎన్నిసార్లు తెలిపినా ఆ సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఇకనైనా మా సమస్యను పరిష్కరించి కార్మికుల జీవితాల్లో వెలుగు నింపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. నగర ప్రధాన కార్యదర్శి యాసిన్ బేగ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మనోహర్ నగర అధ్యక్షులు వెంకటేశ్వర్లు రాష్ట్ర కోశాధికారి సమీర్‌బాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగ శేషు, మహిళా కార్మికు లందరూ పాల్గొన్నారు.

వంటా వార్పుతో నిరసన చేపడుతున్న కార్మికులు

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని పరిశీలించిన జడ్జి

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మంగళవారం కర్నూలు ఇందిరా గాంధి నగర్‌లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి అక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. అక్కడి వారిని అడిగి వారికీ అందించే భోజన వసతి సదుపాయలను గురించి తెలుసు కున్నారు. వసతి గృహానికి సంబంధించిన రిజిస్టర్లను తప్పనిసరిగా మెయింటేన్ చేయాలని పట్టణ వసతి గృహ నిర్వాహకురాలి ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకటరమణ, డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొనారు.

జిల్లా జైలు , మహిళా జైలు తనిఖీ

జిల్లా న్యాయ సేవాది కార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి కర్నూలులోని పురుషుల కేంద్ర కారాగారం, మహిళ కారాగారాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేసి 'జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్' గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారాలీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలు లలో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని కోరారు. ఖైధీలకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళు వయస్సు పై బడిన ఖైధిలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఖైధీలకు అందించే ఆహారాన్ని,రేషన్ ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైధీలను కోర్ట్ వాయిదాలకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారిని సంప్రదించవచ్చని అన్నారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జైలు అధికారులు, లాయర్ శివరాం, ఖైదీలు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్స్‌అవార్డు గ్రహీత కు సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

షైనింగ్ స్టార్స్ అవార్డు ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలవిద్యార్థిని ఎస్లావత్ ఉషాబాయి అందుకోవడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ ఎస్.నాగస్వామినాయక్ కళాశాల అధ్యాపకులు మంగళవారం అభినందించారు. ఉషాబాయి, తల్లిదండ్రులను ప్రిన్సిపాల్ , లెక్చరర్స్ ఘనంగా సన్మానించారు.

డిసిసి పీఠం ఎవరికి?

-కార్యకర్తలను పట్టించుకునే దిక్కెవరిది
- నేడు కర్నూలులో వైఎస్.షర్మిల పర్యటన
-కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుతో భేటీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా అంటేనే కాంగ్రెస్ పార్టీకి కంచుకోట లాంటిది. అలాంటిది ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని నడిపించేటువంటి నాయకుడు లేక దిక్కుతోచని స్థితిలో పడింది. ఇప్పటివరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నియా మకం లేకపోవడంతో పార్టీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేటువంటి నాయకులు కూడా లేకపోవ డంతో కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు. పిసిసి రాష్ట్ర అధ్యక్షు రాలు వైఎస్ షర్మిల కర్నూల్ పర్యటనకు బుధవారం రానున్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో నేరుగా సమావేశం కానున్నారు. కాంగ్రెస్ పార్టీబలోపేతంపై పార్టీ నాయకులు కార్యకర్తలుతో వైఎస్.షర్మిల చర్చించనున్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పి మురళీకృష్ణను తొలగించిన తర్వాతఇప్పటివరకు అధ్యక్షున్ని నియమించ లేదు. ప్రస్తుతం కర్నూలు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ జిలాని భాషకు ఇన్చార్జి బాధ్యతలను అప్పగించారు. పార్టీ కార్యకలాపాల పర్యవేక్షణకు మాత్రమే ఆయన పర్యవేక్షణ చేస్తున్నారు. గతంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులకు గతంలో కంటే అత్యధిక ఓట్లను సాధించారు. జిల్లాలో అనేక నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి క్రియాశీలకమైన కార్యకర్తలే ఉన్నారు. అయితే వారిని నడిపించే నాయకులు లేక పోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలు స్తబ్దతగా ఉన్నారు. అనేక నియోజకవర్గాల్లో ఇన్చా ర్జులు ఉన్నప్పటికీ నామమాత్రంగానే పనిచేస్తున్నారు. ఎవరు కూడా గ్రామ స్థాయిలోకి వెళ్లి పార్టీ బలోపేతానికై కృషి చేయడం లేదని కార్యకర్తలు ఆర్పి స్తున్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని నడిపించే నాయ కుడు లేకపోవడంతో కూడా కార్యకర్తలు ఎవరికి చెప్పుకోవాలని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత కొన్ని రోజు లుగా డిసిసి అధ్యక్షునియామకంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృశ్య సారించి నప్పటికీ అనేక మంది ఆశావాహులు పోటీలో ఉన్నారు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేసేటువంటి వారిని మాత్రమే డిసిసి అధ్యక్షుడిగా నియమించాలని కాంగ్రెస్ కార్య కర్తలు కోరుతున్నారు. అందర్నీ కలుపుకొని పోయి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే వారిని మాత్రమే నియమించాలని పిసిసి అధ్యక్షురాలు దృష్టికి తీసుకు వెళ్లేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సన్నద్ధమయ్యారు.

ఘనంగా బాలకష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదిన సందర్భంగా కెడిసిసిబి చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి, కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కర్నూలు జిల్లా పరిషత్, ఎన్‌విఆర్ కాంప్లెక్స్ కార్యాలయంలో డి.విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సినీ నటుడిగా కళామతల్లికి ముద్దబిడ్డగా, కాన్సర్ హాస్పటల్ చైర్మన్‌గా ,హిందూపురం, ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తూ అందరి మన్ననలు పొందుతున్న నటసింహం నందమూరి బాలకష్ణకు అని కొనియాడారు. ఎన్టీఆర్ నట వారసుడిగా సినీరంగ ప్రవేశం చేసి, అతి తక్కువ కాలంలోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును, అభిమాన గణాన్ని సంపాదించుకుని, గత నాలుగు దశాబ్దాలుగా నందమూరి నట వారసత్వాన్ని కొనసాగిస్తున్నారని అని అన్నారు. అనంతరం కర్నూలు బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి బ్లడ్ డొనేషన్ చేసిన వారికి అభినందించారు. అభిమానుల మధ్య కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ అభిమానులు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడుమూడురు రూరల్ :కోడుమూరు పట్టణంలో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలలో భాగంగా పాత బస్టాండ్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నందమూరి సేవా సమితి అధ్యక్షులు బిపి ఎల్లప్పనాయుడు మాట్లాడుతూ బాలకృష్ణ సాధించిన విజయాలు, జీవిత విశేషాలు వివరించారు. ఆమడగుంట్ల మాదన్న, బలరాం తదితరులు మాట్లాడారు. బ్రిటిష్ రాముడు, మధు, ధనుంజయ్, ముడుములకుర్తి మల్లేష్, పాలకుర్తి రంగన్న, బడేషా గౌడ్, బీరువాల లక్ష్మన్న, దావూద్, డీలర్ కష్ణ, రాముడు తదితరులు పాల్గొన్నారు

రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, తిక్కారెడ్డి, విష్ణు వర్ధన్‌రెడ్డి,

యోగసాధనలో ఆరోగ్యం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన దివ్య ఔషధమని నగరపాలక మేనేజర్ ఎన్.చిన్నరాముడు తెలిపారు. మంగళవారం బిర్లా కాంపౌండ్‌లోని ఖానా-ఖజానా వద్ద 'స్ట్రీట్ యోగా' కార్యక్రమానికి ఆయన హాజరై, ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యంగా జీవించడానికి యోగాసనాలను నిత్యం చేయాలన్నారు. ప్రజలకు యోగాపై మరింత అవగాహన కల్పించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. నగరంలో ప్రతి సచివాలయ పరిధిలో ఉచిత యోగ శిక్షణ ఇస్తున్నామని అన్నారు. నగర ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోచ్‌లు అవినాష్ శెట్టి, మునిస్వామి, అక్షర, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర మంత్రి నారాయణ విద్యాసంస్థలలో పుస్తకాలను విక్రయిస్తూ వ్యాపారం చేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కార్యదర్శి సాయి ఉదయ్ అన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలో జరుగుతున్న దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేశారు. నారాయణ, సిరాక్, కీర్తి విద్యాసంస్థల ఎదుట పుస్తకాల విక్రయాల్ని మంగళవారం ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. నగర కార్యదర్శి సాయి ఉదయ్ మాట్లాడుతూ... కర్నూలు నగరంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయని తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రుల నుండి వేలాది రూపాయలు ఫీజుల రూపంలో దోపిడీ చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు వీడి పుస్తకాలు, అధిక ఫీజులు పెంచి విక్రయిస్తున్న విద్యాసంస్థలను సీజ్‌చేయాలని డిమాండ్ చేశారు. నగర ఉపాధ్యక్షులు అంజి, మల్లేష్ నగర సహాయ కార్యదర్శిలు పృద్వి, ఆదిత్య నగర కమిటీ సభ్యులు చరణ్, హర్ష భాస్కర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పంటలు సమృద్ధిగా పండాలి

పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌కుమార్

ప్రజాశక్తి-పత్తికొండ

రైతులు సాగు చేసిన పంటలు సమృద్ధిగా పండి అధిక దిగుబడి పొందాలని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ ఆకాంక్షించారు. మంగళవారం పత్తికొండ మండలం జూటూరు గ్రామంలో మాజీ సర్పంచి వడ్డే ఈశ్వరప్ప, మాజీ మండల కన్వీనర్ విజయ్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ ఎద్దులు చేతపట్టి నాగలితో పంట పొలంను దున్నారు. అనంతరం ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సబ్సిడీ వ్యవసాయ పరికరాలు రైతులకు అందజేశామన్నారు. ఈ సంవత్సరం తొలకరి చినుకులతో రైతులు పంట పొలాలు సాగుకు సిద్ధం చేసిన సమయానికి సబ్సిడీ వేరుశనగ విత్తనాలు, రైతుకు కావలసిన అన్ని రకాల విత్తనాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివరెడ్డి, రామానాయుడు, టిడిపి నాయకులు భాస్కర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు..

వైసిపి పత్తికొండ వైస్ ఎంపిపి రంగమ్మ టిడిపిలోకి చేరిక

పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ సమక్షంలో టిడిపిలోకి వైసిపి పత్తికొండ వైస్ ఎంపిపి రంగమ్మ, భర్త సారాయి సంజన్నను టిడిపి కండువా వేసి ఆహ్వానించారు.

నీరు వృథా అవుతున్నా నిర్లక్ష్యం...

- పట్టించుకోని అధికారులు - సిపిఎం మండల కార్యదర్శి జయరాజు

ప్రజాశక్తి - మంత్రాలయం

నీటిని చూపుతున్న నాయకులు

మండలంలోని కలుదేవ కుంట, చిలుకలడోణ గ్రామాల మధ్య ఎస్ఎపి స్కీం ద్వారా పంపిణీ చేసే నీటి పైపులైన్ ద్వారా నీరు వృథా అవుతున్నా పట్టించుకునే అధికారులే లేరని సిపిఎం మండల కార్యదర్శి హెచ్.జయరాజు, బిఎస్ఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవపుత్ర విమర్శించారు. మంగళవారం పైపు లైన్ లీకేజీ వల్ల వృథా అవుతున్న నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తుంగభద్ర నది నుంచి ఎస్ఎపి ఫిల్టర్ బెడ్‌కు మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేసి అక్కడ నుంచి కలుదేవకుంట, చిలుకలడోణ గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారని తెలిపారు. పైపులైన్ లీకేజీ వల్ల మధ్యలోనే చాలా నీరు వృథాగా పోతోందని, గ్రామానికి నీరు సరిగా అందడం లేదని చెప్పారు. నిర్లక్ష్యం వీడి లీకేజీ పైపునకు త్వరగా మరమ్మతులు చేయాలని కోరారు. గతంలో కూడా లీకేజీ మరమ్మతులు చేసినా ఫలితం లేకుండా పోతోందని, కొత్త పైపులైను వేసి కలుదేవకుంట, చిలుకలడోణ గ్రామాలకు నీటి ఎద్దడి లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. వెంటనే సంబంధిత అధికారులు పైపులైన్ లీకేజీ పనులు చేపట్టాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బోయ వెంకటేశులు, బోయ జడప్ప ఉన్నారు.

ఆర్థిక బకాయిలను విడుదల చేయాలి

- యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగమణి

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగమణి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చాలా కాలం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.నాగమణి, జె.ఎల్లప్ప, జిల్లా కార్యదర్శి కౌలన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల గత ప్రభుత్వం హయాం నుంచి రావాల్సిన మెడికల్ బిల్లులు, పిఎఫ్ లోన్లు, ఈఎల్స్ బిల్లులకు సంబంధించిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. 12వ పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించాలని, పెండింగ్ డిఎలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని, 2003 డీఎస్సీ వారికి మెమో 59 ప్రకారం పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనా ఉద్యోగులకు ఆర్థిక అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా కాలక్షేపం చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. యుటిఎఫ్ నాయకులు మల్లారి నాగరాజు, రాఘవేంద్ర, రాజు, నరసింహులు, చంద్రపాల్, దేవపాల్, వై.రామాంజనేయులు పాల్గొన్నారు.

కిశోర బాలికల సర్వతోముఖాభివృద్ధికి కృషి

- ఐసిడిఎస్ సిడిపిఒ సఫారున్నీసా బేగం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కిశోర బాలబాలికల సర్వతోముఖాభివృద్ధికి ఐసిడిఎస్ కృషి చేస్తోందని సిడిపిఒ సఫారున్నీసా బేగం పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 15వ వార్డు కటిక వీధిలో కిశోరి వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంపెయిన్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నెలరోజుల పాటు జరిగిన కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం కిశోర బాలికల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కిశోరి వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. సోషల్ వర్కర్ నరసింహులు మాట్లాడుతూ... కిశోర బాలికలు ఆపదలో ఉన్నప్పుడు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. అనంతరం ర్యాలీ చేపట్టి, ప్రతిజ్ఞ చేశారు. వార్డు కౌన్సిలర్ దౌలత్ బీ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాధ, అంగన్వాడీ వర్కర్లు గోవర్ధనమ్మ, షమీన, ఎఎన్ఎం లక్ష్మీ పాల్గొన్నారు.

కొరవడిన సమన్వయం

- అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాజీనామా
- కౌన్సిలర్ బాలాజీ

అసహనం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్ బాలాజీ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీలో కౌన్సిలర్లు, అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. పట్టణ అభివృద్ధి కోసం ఒకే తాటిపై నడవాల్సిన వారు పంతాలకు పోతున్నారు. తమకేమీ పట్టని విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. అధికారుల వ్యవహార శైలి నచ్చక కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తున్నామని బాలాజీ ప్రకటించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఛైర్మన్ లోకేశ్వరి అధ్యక్షతన మంగళవారం జరిగింది. తన వార్డులో అభివృద్ధి పనులు జరగడం లేదని, పూర్తిస్థాయిలో పనులు చేయాలని, లేకపోతే పదవికి రాజీనామా చేస్తానని ఈనెల 4న కమిషనర్ కృష్ణకు చెప్పానని కౌన్సిలర్ బాలాజీ వివరించారు. తాను రాజీనామా చేసి వారమవుతున్నా ఇంతవరకు ఎందుకు ఆమోదించడం లేదని, తాను ఇప్పటికీ రాజీనామాకు కట్టుబడి ఉన్నానని, వెంటనే అత్యవసర సమావేశం పెట్టి ఆమోదించాలని వేడుకుంటున్నానని తెలిపారు. ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌కు ఇటీవల నిర్వహించిన వేలంపాటలో దక్కించుకున్న వారికి వసూలు కోసం హక్కు కల్పించడానికి నిర్వహించిన ఈ సమావేశంలో కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అంతకుముందు సమావేశం ప్రారంభం కాగానే వైసిపి సీనియర్ కౌన్సిలర్ బాలాజీ మాట్లాడుతూ... తన వార్డులో సిసి రోడ్లు, డ్రెయినేజీ, పైపులైన్ పనులు చేయాలని అనేకసార్లు వేడుకున్నానని తెలిపారు. సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులు జరిగాయని, పైపులైన్, కొంతవరకు డ్రెయినేజీ పనులు మాత్రం ఆలస్యంగా చేయడంతో ప్రజలు తనను విమర్శిస్తున్నారని చెప్పారు. అడ్డంగా ఉన్న వాటిని ప్రజలే తొలగించుకోవాలని కాంట్రాక్టర్ చెప్పారని, ప్రజలు తొలగించుకున్నా పనులు చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. కేవలం ఒకరు తొలగించుకోలేదని పనులే చేయకపోతే ఎలా అని నిలదీశారు. ఈ విషయంలో తాను మున్సిపల్ కమిషనర్‌ను, ఇతర ఇంజినీరింగ్ అధికారులను కోరినా సరైన సమాధానం లేకపోవడం, న్యాయం జరగకపోవడంతోనే తాను గత వారంలో రాజీనామా చేసినట్లు తెలిపారు. తన వార్డు ప్రజలతో వెళ్లి రాజీనామా పత్రం కమిషనర్‌కు ఇస్తే కనీస మర్యాద కూడా ఇవ్వకుండా.. కూర్చోమని కూడా చెప్పకుండా తన వార్డు ప్రజల ముందు తనను అవమానించారని చెప్పారు. పనులు మాత్రం చేయలేదని వాపోయారు. తాను రాజీనామాకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని, ఇప్పటికైనా ఆమోదించాలని కోరారు. కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ... కౌన్సిలర్ బాలాజీ రాజీనామా ఇచ్చిన మాట వాస్తవమని, అత్యవసర సమావేశం పెట్టి ఆమోదించడం జరగదని, సాధారణ సమావేశం అజెండాలో అంశం పెడతామని తెలిపారు. అయితే బాధ్యత కౌన్సిల్‌కు ఉంటుందన్నారు. రాజీనామా ఆమోదానికి అజెండాలో పెట్టి కౌన్సిల్‌ ఆశ్రయిస్తానని బాలాజీ తెలిపారు. ఎక్కడికి వెళ్లినా చివరకు కౌన్సిల్ ఆమోదం చేయాల్సి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు. రాజీనామా చేయాల్సిన అవసరం లేదని, అభివృద్ధి చేస్తామని, దీనిపై చర్చిద్దామని ప్రత్యేకంగా అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని వైస్ చైర్మన్ లోకేశ్వరి పేర్కొన్నారు. కౌన్సిలర్ సందీప్ రెడ్డి జోక్యం చేసుకొని... ఎందుకు పనులు చేయడం లేదని అధికారులను ప్రశ్నించారు. కొంతవరకు చర్చ జరిగినా సరైన సమాధానం రాకపోవడంతో కౌన్సిలర్ బాలాజీ తన రాజీనామాను ఆమోదించాలని రెండు చేతులెత్తి మొక్కి బయటకు వెళ్లారు. తాను వైసిపికి రాజీనామా చేయడం లేదని, కేవలం తన కౌన్సిలర్ పదవికి మాత్రమే రాజీనామా చేస్తున్నానని తెలిపారు. ఆమోదించాలని కోరారు. మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్, డిప్యూటీ ఇంజినీర్ రామమూర్తి, గోనేశ్, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు చలపతి, రాజేశ్వర్ రెడ్డి, అశోక్, రఘునాథరెడ్డి, ఇంతియాజ్, శాంత, పార్వతి, వసీం ఉన్నారు.

బాలాజీకి నచ్చజెబుతున్న ఛైర్మన్ లోకేశ్వరి

రీసర్వేపై గ్రామసభ

- ప్రజాసమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - కౌతాళం

వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మండలంలోని ఉప్ప రహాల్ గ్రామంలో రీసర్వే తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ పరిధిలోని రైతుల భూములను రెవెన్యూ అధికారులు రీసర్వే చేసినట్లు తెలిపారు. రీసర్వేపై రైతులతో హద్దులపై చర్చించి సమస్యలు లేని రైతులతో పత్రాలను రాతపూర్వకంగా తీసుకున్నారు. ఇదే గ్రామంలో ఇంటి స్థలాల సర్వే కోసం చలానాలు కట్టి రోజులు గడుస్తున్నా సర్వే చేసి హద్దులు చూపలేదని గ్రామానికి చెందిన హుసేని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హుసేని మాట్లాడుతూ... ఇటీవల కురిసిన భారీ వర్షానికి పక్కనే ఉన్న ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చిందన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్థలాల సరిహద్దులను చూపించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

మూడు ఆలయాల్లో దొంగతనాలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని నల్లచెలిమల గ్రామంలో మూడు ఆలయాల్లో దుండగులు సోమవారం రాత్రి సమయంలో చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తుల వివరాల మేరకు... గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో స్వామివారి సుమారు 9 తులాల విలువ చేసే బంగారు మీసాలు, కనురెప్పలు దొంగలించారు. అలాగే మారెమ్మ, కాశీరెడ్డి నాయన స్వామి దేవాలయంలో హుండీలను పగలగొట్టి వాటిలోని నగదు దొంగలించి తీసుకెళ్లారు. లక్ష్మీనరసింహస్వామి హుండీ ఎత్తుకెళ్లి నగదు తీసుకొని ముళ్ల పొదల్లో వేసి వెళ్లినట్లు మంగళవారం గ్రామస్తులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ వంశీనాథ్, పోలీసు సిబ్బంది గ్రామాన్ని సందర్శించి చోరీకి గురైన దేవాలయాలను పరిశీలించారు. ఈ విషయంపై పోలీసులను ప్రశ్నించగా దొంగతనం జరిగిన తీరును గ్రామస్తుల ద్వారా తెలుసుకొని విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లక్ష్మయ్యను పరామర్శిస్తున్న జడ్‌పిటిసిలు

మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్యకు పరామర్శ

ప్రజాశక్తి - మంత్రాలయం

మండల మాజీ జడ్‌పిటిసి సభ్యులు లక్ష్మయ్యను కోసిగి మండల మాజీ జడ్‌పిటిసి సభ్యులు తోవి రామకృష్ణ, కోసిగి హీరో షోరూం నిర్వాహకులు వీరేష్, నాయకులు నాడిగేని తాయన్న, ఎస్ఎం.గోపాల్ రెడ్డి పరామర్శించారు. మంగళవారం మండలంలోని మాలపల్లి గ్రామంలోని లక్ష్మయ్య స్వగృహంలో ఆయనను కలుసుకొని ఘటనపై ఆరా తీశారు. గ్రామంలో ఇటీవల న్యాయవాది గురురాజ రావు, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్యల మధ్య జరిగిన తగాదాలో గాయపడి ఆదోనిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న ఆయనకు ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భూములకు సంబంధించిన ఘర్షణను వ్యక్తిగతంగానే చూడాలని బార్ అసోసియేషన్ సభ్యులకు సూచించారు.

గురురాజరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

గురురాజ రావుకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపికి చెందిన ఆర్.లక్ష్మయ్య గ్రూపు దాడిలో గాయపడిన వైసిపి రాష్ట్ర లీగల్ సెల్ నాయకులు న్యాయవాది గురురాజరావును, తండ్రి జగన్నాథ రావును ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆయన సతీమణి కాచాపురం సర్పంచి వై.జయమ్మ పరామర్శించారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలోని గురురాజ రావు స్వగృహంలో కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దాడి ఘటన గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయడం వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ప్రజలు తిప్పికొట్టడం ఖాయమన్నారు. వైసిపి తరపున, తమ కుటుంబం తరపున గురురాజరావు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మండల కన్వీనర్ భీమారెడ్డి, మండల నాయకులు బూదూరు మల్లికార్జున రెడ్డి ఉన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగించొద్దు

- డీఎస్పీ ఉపేంద్ర బాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

గ్రామంలో ప్రశాంతతకు భంగం కలిగించవద్దని డీఎస్పీ ఉపేంద్ర బాబు కోరారు. మంగళవారం మండలంలోని చెట్నిహల్లి గ్రామంలోని బీరప్ప దేవాలయంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న శ్మశాన వాటిక సమస్యను ఇరువర్గాల వారు సామరస్యంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. బుధవారం కలెక్టర్ ద్వారా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎలాంటి నిర్ణయం తీసుకున్నా సహకరించాలని కోరారు. సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు

అధిష్టానం నిర్ణయం మేరకే బీసీలకు 'ఛైర్మన్'

- మాధవరావు దేశాయ్ రాజీనామా వెనక్కి తీసుకోవాలి

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అధిష్టానం మేరకే నియోజకవర్గంలో దాదాపు 40 వేలకు పైగా ఉన్న బీసీ (కురువ) సామాజిక వర్గాన్ని గుర్తించి కురువ మల్లయ్యను వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా నిర్ణయించినట్లు టిడిపి నందవరం మండల నాయకులు ఖాసీం వలీ, ఈరన్న గౌడ్, నాగరాజు గౌడ్, రైస్ మిల్లు నారాయణరెడ్డి, చిన్న రాముడు, ధర్మపురం గోపాల్ తెలిపారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తన వల్ల మెజారిటీ వచ్చిందని మాధవరావు దేశాయ్ చెప్పడం శోచనీయమని తెలిపారు. మండలంలో ఉన్న టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలందరూ కష్టపడితేనే ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డికి మెజారిటీ వచ్చిందని చెప్పారు. అన్యాయం జరిగి ఉంటే ఎమ్మెల్యేతో చర్చించాలని, ఇలాంటి ప్రకటనలు మానుకోవాలని సూచించారు. టిడిపిలో సీనియర్లు ఉన్నారని, వారు పదవి ఉన్నా, లేకున్నా పార్టీ కోసం కష్టపడుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో అందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. టిడిపిపై దుష్ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అసంతృప్తిలో పడి రాజీనామా చేసిన మాధవరావు దేశాయ్ రాజీనామాను వెనక్కి తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు ఉంటుందని, దుర్వినియోగం చేసుకోవద్దని తెలిపారు. నందవరం మండలంలో ఏ నాయకుడూ బాధలో లేడని, అందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. మండల నాయకులందరూ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి అడుగుజాడల్లో నడుస్తున్నారని స్పష్టం చేశారు. మాధవరావు దేశాయ్ కూడా పార్టీలో చాలా కాలం నుంచి ఉన్నారని, అలాంటిది పార్టీపై తప్పుడు ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదని తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ ప్రతి సామాజిక వర్గానికి న్యాయం చేసుకుంటూ, పార్టీ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. తామంతా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి వెంటే ఉన్నామని, ఏమన్నా సమస్య ఉంటే ఆయనతో చర్చించి పరిష్కరించుకుంటామని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు ఖాసీం వలీ

రహదారిపై ఆగి ఉన్న వర్షపు నీరు

చెరువును తలపిస్తున్న రహదారి

- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని పల్లెదొడ్డి గ్రామ సమీపంలోని రహదారి వర్షపు నీటితో నిండి చెరువును తలపిస్తోంది. ఈ రహదారి గూండా ప్రయాణం సాగించేందుకు వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై నిత్యం జిల్లేడు బుడకల, మాదాపురం, ఓబులాపురం, బుర్రకుంట, వెంకటాపురం గ్రామస్తులు దేవనకొండకు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. పల్లెదొడ్డి గ్రామ సమీపంలోని రోడ్డుపై గుంతపడి వర్షపు నీరు నిలిచింది. నీరు పారేందుకు దారి లేదు. రోడ్డుకిరువైపులా ఉన్న రైతుల పొలాల్లోకి వర్షపు నీరు రాకుండా అడ్డగించడంతో రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో ద్విచక్ర వాహనదారులు, అత్యవసర రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత శాఖాధికారులు స్పందించి వర్షపు నీరు నిల్వ ఉండకుండా వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

వ్యక్తిగత ఘర్షణను వృత్తికి ఆపాదించడం తగదు

- న్యాయవాద వృత్తిని అడ్డం పెట్టుకొని అక్రమ కేసులు పెడితే సహించం

- లా పట్టా రద్దుకు పోరాటం

- వాల్మీకి పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంభీం నాయుడు

ప్రజాశక్తి - మంత్రాలయం

భూసంబంధిత వ్యక్తిగత ఘర్షణను న్యాయవాద వృత్తికి ఆపాదించడం న్యాయవాది గురురాజ రావుకు తగదని, ఈ విషయాన్ని బార్ అసోసియేషన్ గుర్తించాలని వాల్మీకి పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంభీం నాయుడు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాఘవేంద్ర రావు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రయివేట్ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. న్యాయవాద వృత్తిని అడ్డం పెట్టుకొని వాల్మీకి నాయకులు, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్యపై అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. ఈనెల 4న మాలపల్లి గ్రామానికి చెందిన అడ్వకేట్ గురురాజ రావు, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య మధ్య భూములకు సంబంధించిన గొడవ జరిగిందని చెప్పారు. ఈ తగాదాలు ఇప్పటివి కాదని, 2019 నుంచి జరుగుతూ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఆస్తుల కోసం జరిగిన వ్యక్తిగత గొడవలుగానే చూడాలన్నారు. 2014లో గురురాజు రావు దాయాదుల భూమిని లక్ష్మయ్య కొన్నారని, అప్పటి నుంచి వారి ఇద్దరి మధ్య గొడవలు చెలరేగాయని తెలిపారు. 2019, 2022, 2023లో ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారని, అవి ఇంకా కోర్టులో నడుస్తున్నాయని చెప్పారు. గురురాజరావు న్యాయవాద వృత్తిని అడ్డం పెట్టుకొని లక్ష్మయ్య కుటుంబంపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. గురురాజ రావు ఫిర్యాదుతో ఎమ్మిగనూరు, ఆదోని బార్ అసోసియేషన్ స్పందించి ఆయనకు మద్దతు ఇవ్వడంతో పాటు లక్ష్మయ్య కేసును ఎవరూ తీసుకోకూడదని చెప్పడం బాధాకరమన్నారు. న్యాయవాదులు కూడా ఇది వ్యక్తిగత గొడవలుగానే పరిగణించాలని తెలిపారు. న్యాయవాదులంటే తమకూ గౌరవం ఉందన్నారు. న్యాయవాద వృత్తిని అడ్డం పెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తే ఎమ్మిగనూరు, ఆదోని బార్ అసోసియేషన్లకు తాము కూడా ఫిర్యాదు చేస్తామని, అలాంటి వారి లైసెన్సు రద్దు చేయాలని కోరుతామని అన్నారు. లా పట్టా రద్దు చేసే వరకు పోరాడతామని హెచ్చరించారు. వాల్మీకి నాయకులు మాలపల్లి ఆర్.లక్ష్మన్న, చేపల నాగేష్, మేకల మల్లేష్, వీరారెడ్డి, డిసి.తిమ్మప్ప, వరదరాజు, ఎంపిటిసి మేకల వెంకటేష్, సుంకేశ్వరి గ్రామ నాయకులు రంగన్న, గంగన్న, బీరప్ప, నాగభూషణ్, నరసింహులు, వీరనాగప్ప, బసప్ప రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

చెరువును తలపిస్తున్న పశువైద్యశాల..!

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాడి రైతులు..!

ప్రజాశక్తి - కౌతాళం

వర్షాకాలం మొదలైందంటే పాడి రైతులకు కష్టాలు మొదలైనట్లే... రైతులకు చేదోడువాదోడుగా ఉండే పశువులు వర్షాకాలంలో అనేక వ్యాధులకు గురవుతాయి. ఇలాంటి సమయంలో పాడి రైతులు పరుగులు పెట్టి పశు వైద్యశాలకు తరలివస్తారు. కౌతాళంలోని పశు వైద్యశాలను చూస్తే చెరువును తలపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షపు నీరంతా పశు వైద్యశాలలో చేరి నీటికుంటలా తయారైంది. పశువులను తీసుకొచ్చిన రైతులు, తమ పశువులను ఎక్కడ ఆపాలో తెలియక నానా తంటాలు పడుతున్నారు. సంబంధిత అధికారులు నీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

హెబ్బటంలో నీటి కష్టాలు

- వారం రోజులుగా అందని తాగునీరు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

గ్రామాల్లో గుక్కెడు నీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని హెబ్బటం గ్రామంలో కుళాయిలకు పంచాయతీ అధికారులు వారం రోజులుగా నీటి సరఫరా చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ శివారులోని పంప్ హౌస్ వద్ద ఉన్న నీటి సంపు వద్దకు వెళ్లి ఎద్దుల బండిపై డ్రమ్ముల ద్వారా, తోపుడుబండ్లు, సైకిళ్ల ద్వారా నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ అధికారి రాజశేఖర్ గౌడ్‌ను వివరణ కోరగా... నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

ఎద్దుల బండిపై డ్రమ్ముల ద్వారా నీరు తెచ్చుకుంటున్న ప్రజలు

ఐఐటి ఫౌండేషన్ 'అమరావతి' ప్రత్యేకత

- కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

ప్రాథమిక దశలోనే విద్యార్థులకు ఐఐటి ఫౌండేషన్ పరిచయం చేయడం అమరావతి పాఠశాల ప్రత్యేకత అని కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. విశాలమైన మైదానంలో సొంత భవనంలో అమరావతి పాఠశాల పదేళ్లుగా కొనసాగుతోందని తెలిపారు. ప్రాథమిక దశలోనే టెక్నాలజీతో కూడిన నాణ్యమైన విద్యనందించేందుకు ఏర్పాటు చేశామన్నారు. తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు పాఠశాలలో హాస్టల్ వసతి కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. విశాలమైన డైనింగ్ హాలు.. చిన్నారులకు ప్రత్యేకించి బెడ్ సదుపాయం ఉందన్నారు. ప్రస్తుతం కంప్యూటర్ యుగంలో ప్రాథమిక దశ నుంచే విజ్ఞానం పెంపొందించేందుకు 6వ తరగతి నుంచి ఐఐటి ఫౌండేషన్ తరగతుల బోధన నిర్వహిస్తున్నామని తెలిపారు. సొంత భవనం, ఆహ్లాదకరమైన వాతావరణం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత అర్థమయ్యే రీతిలో బోధన ఉంటుందని చెప్పారు. వారం వారం టెస్ట్ నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో 588 మార్కులతో టౌన్ టాపర్‌గా తమ పాఠశాల విద్యార్థి జి.కల్యాణ్ బాబు నిలిచారని చెప్పారు. ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో, సువిశాలమైన పాఠశాల భవనంలో సృజనాత్మక క్రీడా పద్ధతి ద్వారా అతి తక్కువ ఫీజులకే విద్యా బోధన ఉంటుందన్నారు. అబాకస్, వేదిక్ మ్యాథ్స్, రీజనింగ్ కంప్యూటర్‌లో ప్రత్యేక శిక్షణతో పాటు లీడ్ ఆధారిత డిజిటల్ క్లాసుల ద్వారా విద్యా బోధన అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు మానసికంగా, శారీరక దృఢంగా ఉండడానికి ధ్యానం, యోగా, కరాటే, డ్యాన్స్ క్లాసులు నిర్వహిస్తున్నామని చెప్పారు. స్పష్టమైన పద ఉచ్ఛారణ కోసం భగవద్గీత శ్లోకాలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సదుపాయం ఉందన్నారు. నాణ్యమైన విద్యతో చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాట వేయడం అమరావతి పాఠశాల ప్రత్యేకత అని వివరించారు.

ప్రతిభ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థి ఉమ్మి ఐమాన్‌ను అభినందిస్తున్న దేవదానం

ఇంటర్ ఒకేషనల్ ఫలితాల్లో ఫిజియోథెరపీలో తమ కళాశాల విద్యార్థిని ఉమ్మి ఐమాన్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించి ప్రతిభ అవార్డు పొందడం అభినందనీయమని నోబుల్ ఒకేషనల్ కళాశాల కరస్పాండెంట్ సంగటి దేవదానం తెలిపారు. పది, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డు అందుకున్న ఉమ్మి ఐమాన్‌ను కళాశాల ప్రాంగణంలో మంగళవారం పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా దేవదానం మాట్లాడారు. ఇంటర్ ఒకేషనల్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థిని ఉమ్మి ఐమాన్ ఫిజియోథెరపీలో 988/1000 మార్కులు సాధించి రాష్ట్రంలో ద్వితీయ ర్యాంకు సాధించి తమ కళాశాలకు వన్నెతెచ్చారని కొనియాడారు. పట్టణంలోని రాంజల రోడ్డులో ఆహ్లాదకరమైన వాతావరణం, సువిశాలమైన గదుల్లో, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత బోధన అందిస్తూ మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ప్రతేడాది ఫలితాలు సాధించడంలో తమ విద్యార్థులు ముందు వరుసలో ఉండడం హర్షణీయమన్నారు. సోమవారం రాష్ట్ర మంత్రి టిజి.భరత్, జెసి నవ్య, ఎమ్మెల్యే గౌరుచరత, విద్యా శాఖ ఉన్నతాధికారుల చేతుల మీదుగా షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డును అందుకున్న ఉమ్మి ఐమాన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి సమిష్టిగా కృషి చేయడంతోనే ఈ ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. ఇందుకు సహకరించిన విద్యార్థి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ అబ్దుల్ ఖాలిక్, డాక్టర్ సలోమి, డాక్టర్ జావిద్, నిఖిల్, అధ్యాపకులు ప్రీతి, స్రవంతి, ప్రవీణ్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దినకర్ ఉన్నారు.

మూడేళ్లు దాటిన పిల్లలు అంగన్వాడీలో...

- ఐసిడిఎస్ సూపర్‌జర్ ప్రసూన

ప్రజాశక్తి - చిప్పగిరి

మూడేళ్లు దాటిన పిల్లలందరూ అంగన్వాడీ కేంద్రాల్లో ఉండేలా తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది కృషి చేయాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన తెలిపారు. మంగళవారం చిప్పగిరి అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం, అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మూడేళ్లు దాటిన పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రానికి చేర్చాలని, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యతోపాటు ఆటపాటలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు పౌష్టికాహారం, మధ్యాహ్నం గుడ్డు, పాలు అందిస్తున్నట్లు చెప్పారు. పిల్లలున్న తల్లిదండ్రులంతా తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు తమ పిల్లలను పంపాలని కోరారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఇంటింటికీ వెళ్లి మూడేళ్లు పూర్తి చేసుకున్న పిల్లలను గుర్తించి వారిని అంగన్వాడీ కేంద్రాలకు పంపే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పిల్లలతో అంగన్వాడీ పిలుస్తుంది ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ ప్రసూన